క్లుప్తంగా

3న పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లు

రేపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అక్టోబరు 3న మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వి.సంధ్యారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ పరీక్షలు రాసిన, రాయనివారు ఈ అడ్మిషన్‌లకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌ఫోటోలతో హాజరుకావాలని తెలిపారు. ఈసీఈ, మెకానికల్, సివిల్ బ్రాంచ్‌లలో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలోగాని, 80965 55306, 89784 21087 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

నేడు 12వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రేపల్లె: పట్టణంలోని 12వ వార్డులో శనివారం ఉదయం 8 గంటలకు గడప గడపకు వైఎస్సార్ సీపీ కార్యక్రమం నిర్వహించబడునని ఆ పార్టీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చిరస్మరణీయుడు ఎం.ఎస్ స్వామినాథన్

భట్టిప్రోలు: హరిత విప్లవానికి బాటలు వేసిన ఎంఎస్ స్వామినాథన్ చిరస్మరణీయులని వేమూరు మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ ఉప్పు శిరీష అన్నారు. భట్టిప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో స్వామినాథన్ చిత్రపటానికి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ వ్యవసాయ రంగ గతిని మార్చిన మహనీయుడు స్వామినాథన్ అని కొనియాడారు. సర్పంచ్ దారా రవికిరణ్మయి, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా యువజన విభాగం కార్యదర్శి పీజీ అరుణ్‌శాస్త్రి, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొతరపు శ్రీనివాసరావు, పార్టీ మండల కార్యదర్శి మోర్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణ పనుల పరిశీలన

రేపల్లె రూరల్: పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని టెక్నికల్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్ కుమార్ ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో నిర్మాణంలో ఉన్న కళాశాల భవన నిర్మాణ పనులను శుక్రవారం సాయంత్రం పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు. నిర్మాణ పనులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అక్టోబర్ 3న స్పాట్ అడ్మిషన్‌లకు కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సంధ్యారాణి, అధ్యాపకులున్నారు.

ఉచిత కంటి పరీక్షలు



కొల్లూరు : కొల్లూరు వివేక విద్యా సంస్థల్లో ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. తెనాలి రోటరీ క్లబ్, హెల్త్ వైద్యశాల సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో 4 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు, పాఠశాల సిబ్బందికి పరీక్షలు జరిపారు. రెండ్రోజుల పాటు నిర్వహించనున్న శిబిరంలో శుక్రవారం 170 మందికి పరీక్షలు జరపగా, వారిలో 35 మందికి కళ్లజోళ్లు అవసరమని నిర్ధారించారు. తల్లిదండ్రుల్లో 6 గురుకి శుక్లాల శస్త్ర శికిత్స చేయాల్సిన అవసరముందని గుర్తించడంతోపాటు, 8 మందికి కళ్లజోళ్లు అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు పావులూరు రాంబాబు, కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, వివేక విద్యా సంస్థల డైరెక్టర్లు రావిపాటి వీరనారాయణరావు, కె. రామరాజు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గుత్తా వెంకటరత్నం, హెల్త్ వైద్యశాల వైద్యులు షేక్ సుభాని, కె. కేశవ్, పీఆర్‌ఓ పాల్గొన్నారు.

రేబిస్‌ను అరికట్టేందుకు అవగాహన

బాపట్ల: రేబిస్ వ్యాధికి గురికాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టరు ఎస్.విజయమ్మ పేర్కొన్నారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఏరియా వైద్యశాల నుంచి శుక్రవారం ప్రదర్శన చేపట్టారు. కుక్క కరిచిన వెంటనే వైద్యుని సలహా మేరకు ఇంజక్షన్ వేయించుకోవాలని చెప్పారు. పెంపుడు జంతువులకు కూడా తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని స్పష్టం చేశారు.

పేదల జీవన ప్రమాణాల పెంపు ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- యడ్లపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధునికి సంక్షేమం వివరిస్తూ సంతోషంగా మంత్రి మేరుగ నాగార్జున

యడ్లపల్లి(వేమూరు): పేదల జీవన ప్రమాణాల్లో మార్పులు తీసుకొని వచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు బాటలు వేశారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును ఆయన వివరించారు. సంక్షేమ పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకునిరావాలని స్థానికులకు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మెరగైన వైద్య సేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలకు అన్ని విధాలుగా ఆయన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షేక్ ముంతాజ్, ఎంపీపీ జాలాది రూబేను, ఉప సర్పంచ్ చావ సత్యనారాయణ, ఎంపీటీసీ నల్లబోతుల ప్రసన్న కుమారి, మండల కో-ఆప్షన్ మెంబరు పఠాన్ అబ్దుల్, బీసీ సెల్ అధ్యక్షుడు వల్లెపు వెంకటేశ్వర్లు, మండల మహిళ విభాగం అధ్యక్షురాలు శోభరాణి, బూత్ కన్వీనర్లు, చుండూరు గ్రామ సర్పంచ్ వుయ్యూరి అప్పి రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గాదె శివరామ కృష్ణా రెడ్డి, అళ్ల రమణా రెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ నగదు చెక్కు అందజేత

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామంలో గత నెల 19న లైంగిక దాడికి గురైన బాలిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆపన్న హస్తం అందించింది. సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 10 లక్షల నగదు చెక్కును రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున శుక్రవారం అందజేశారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ జరిగిన ఘటన చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ చైర్మన్(బౌడ), రేపల్లె మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, గ్రామ సర్పంచ్ చొటూరి లక్ష్మి, ఎంపీటీసీ దారావత్ కుమారీభాయ్, వేమూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ నాయకులు గురిందపల్లి సునీల్, మోటూరి చౌదరి, చొటూరి రవీంద్ర, చందోలు రవికుమార్, గుడిపల్లి సాంబయ్య, గుడిపల్లి సుబ్బారావు,మునిపల్లి ఏడుకొండలు, వాకా బద్రయ్య, శివమణి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- ఉప్పాలవారిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

చెరుకుపల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆళ్ళవారిపాలెం పంచాయతీ ఉప్పాలవారిపాలెం గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ రూ.లక్షల్లో లబ్ధి పొంది ఆర్థి భద్రత పొందుతున్నారని ఎంపీ పేర్కొన్నారు. పేదవారి ఆర్థిక భద్రతే ఈ సంక్షేమ పథకాల లక్ష్యమన్నారు. గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమంతో స్వర్ణయుగాన్ని తలపిస్తోందన్నారు. పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. అనంతరం ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని, ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు చేకూరిన లబ్ధి వివరాలను స్వయంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర ప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు, మండల కన్వీనర్ పయనం ఏడుకొండలరెడ్డి, ఎంపీటీసీ పీటా రాంబాబు, సర్పంచ్ కూరేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

రేపల్లె: గణేశ్ నిమజ్జనంలో ఇటీవల అపశృతి చోటు చేసుకుని 24వ వార్డుకు చెందిన పడమటి విజయ్, కొండేటి వెంకటేశ్వరరావు మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు శుక్రవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సాయంఅందేలా కృషి చేస్తానని చెప్పారు. అదేవిధంగా 25వవార్డుకు చెందిన దస్తావేజులేఖరి పసుపులేటి దుర్గాప్రసాద్ మృతి చెందడంతో..వారి కుటుంబ సభ్యులను ఎంపీ పరామర్శించారు. దుర్గాప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సింగుపాలెం సర్పంచ్ యార్లగడ్డ రమాదేవి భర్త శ్రీనివాసరావు మృతి చెందగా ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుపై అవగాహన



పెరవలి(వేమూరు): ఈ క్రాప్ నమోదు కార్యక్రమం పూర్తికాబోతుందని జిల్లా వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ సత్తార్ అన్నారు. పెరవలి గ్రామంలో ఈ-క్రాప్ నమోదుపై రైతులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ క్రాప్ నమోదుకు ప్రభుత్వం కేటాయించిన గడవు పూర్తవుతోందన్నారు. రైతు భరోసా కేంద్రంలో ఎరువులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఏడీఏ హుస్సేన్, ఏఓ సునీత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సాఫ్ట్‌బాల్ టీమ్‌కు భట్టిప్రోలు విద్యార్థి ఎంపిక

భట్టిప్రోలు: స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల పరిధిలో బాపట్ల విలియం బూత్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సెలక్షన్స్‌లో భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థిని తోకల మహిత్ అండర్-14 జిల్లా సాఫ్ట్‌బాల్ టీమ్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. శిక్షణ ఇచ్చిన పీఈటీలు ఎండీ అనూల్‌హక్, చేబ్రోలు శ్రీనివాసరావు, ప్రతిభ చూపిన మహిత్‌ను కరస్పాండెంట్ పి. మల్లికార్జున రావు, హెచ్‌ఎం రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని 11వ వార్డులో రూ. 7 లక్షల వ్యయంతో (పంచాయతీ నిధులు) సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. వార్డు సభ్యులు బండారు మాధవి భూమి పూజ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ దారా రవి కిరణ్మయి విచ్చేశారు. పంచాయతీ వార్డు సభ్యులు వంగర వీరయ్య, వెస్సార్ సీపీ నాయకులు బండారు దిలీప్, కట్టా నాగరాజు, దారా చెన్నయ్య, పాల్గొన్నారు.

11వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రేపల్లె రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 11వ వార్డు గరికపాటివారి వీధిలో శుక్రవారం పట్టణ ఆరోగ్య సిబ్బంది సర్వే నిర్వహించింది. దీనిలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎం.యల్లయ్య, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ

భట్టిప్రోలు: ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధికారులతో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి మాట్లాడుతూ కేవలం 10 రోజుల్లో జగనన్న సురక్ష ద్వారా రాష్ట్రంలో 26 లక్షల గృహాలను సందర్శించి, 72 లక్షల మంది ప్రజలకు వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రాథమిక పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. శనివారం నుంచి అక్టోబర్ 12వ తేదీ వరకు మండలంలోని ప్రతి సచివాలయం పరిధిలో నిష్ణాతులైన వైద్యులతో వైద్య పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజి తదితరులు పాల్గొన్నారు.

ఆజాదీకా అమృత కలశ యాత్ర

కర్లపాలెం: దేశ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని యాజలి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.రమాదేవి అన్నారు. శుక్రవారం పాఠశాల విద్యార్థులు ఆజాదీకా అమృత మహోత్సవంలో భాగంగా అమృత కలశ యాత్ర చేపట్టారు. హెచ్‌ఎం రమాదేవి మట్టి పవిత్రను వివరించారు.

దేవాలయాల్లో సామూహిక పూజలు, హారతులు



హారతులు ఇస్తున్న భక్తులు

భట్టిప్రోలు: సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్‌ఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో భాద్రపద శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని దేవాలయాల్లో నిర్వహిస్తున్న సామూహిక పూజలు, హారతులు శుక్రవారం భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు గీతాజ్ఞాన మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు మాట్లాడుతూ సామూహిక హారతులు ఇవ్వడం వల్ల దోషాలు తొలగి, స్వామి వార్ల అనుగ్రహం కలుగుతుందని పేర్కొన్నారు. సైన్స్ పరంగా కర్పూరం వెలిగించడం వల్ల కంటి దోషాలు, శ్వాస కోస దోషాలు తొలగడమే కాక పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేపల్లె సబ్ డివిజన్ కన్వీనర్ క్రాప రవి కుమార్, వెల్లటూరు గ్రామ భజన మండలి సభ్యులు, భక్తులు, ఎస్‌ఎస్‌ఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభం

వేమూరు: మండలంలోని చదలవాడ గ్రామంలో శనివారం 10 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

కొల్లూరు : పౌష్టికాహారం సకాలంలో తీసుకోవడం ద్వారా గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కిష్కిందపాలెం సర్పంచ్ గుంటూరు నీలాంబరం అన్నారు. శుక్రవారం మండలంలోని కిష్కిందపాలెంలో దోనేపూడి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు సెక్టార్ సమావేశం నిర్వహించారు. పౌష్టికాహార మాసోత్సవాలలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహార ప్రయోజనాలను ఆయన వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రికార్డులు సక్రమంగా నిర్వహించడంతోపాటు, కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని సూపర్‌వైజర్ నగ రాజకుమారి సూచించారు.

మజూరీలు లేక ఇబ్బందులు

భట్టిప్రోలు: చేనేత సొసైటీల్లో పని చేస్తున్న కార్మికులకు గత మూడు నెలలుగా మజూరీలు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు జి. బాలాజి, ఎం. సత్యన్నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం వీరు భట్టిప్రోలులో విలేకరులతో మాట్లాడుతూ సొసైటీల నిర్వహణకు ప్రభుత్వం నియమించిన నామినేటెడ్ పోస్టుల పదవి కాలం ముగియడంతో మూడు నెలలుగా రోజువారీ కార్యక్రమాలు స్తంభించాయని తెలిపారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆయా సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని లేదా ప్రత్యేక అధికారులను నియమించాలని కోరారు. దీంతో సొసైటీలకు సంబంధించిన సొమ్ము బ్యాంకుల్లో ఉన్నప్పటికి డ్రా చేసుకునే మార్గం లేకపోవడంతో కార్మికులకు మజూరీలు అందడం లేదని పేర్కొన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో చేనేత నాయకులు బి. నాగమల్లేశ్వరరావు, కె. రామకోటేశ్వరరావు, కె, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని దహనం చేసిన దుండగులు



దగ్ధమైన ద్విచక్రవాహనం

కొల్లూరు : ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని దుండగులు దహనం చేసిన ఘటన మండలంలోని చిలుమూరులో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. చిలుమూరుకు చెందిన దూళిపూడి కోటేశ్వరరావు గురువారం రాత్రి ఇంటి ముందు వాహనాన్ని ఉంచాడు. స్థానికంగా ఉన్న ఓ ప్రవేటు కళాశాలలో వంటి పనిచేసే కోటేశ్వరరావు తెల్లవారుజాము నిద్రలేచి చూడగా.. తన ద్విచక్ర వాహనం మంటల్లో దగ్ధం అవుతూ కనిపించింది. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోవడంతో వాహనం పూర్తిగా దగ్ధమయ్యింది. వాహన యజమాని కోటేశ్వరరావు కూతురు తన భర్త వేధింపులకు గురిచేస్తుండటంతో గతంలో కొల్లూరు పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టి పుట్టింటి వద్దనే ఉంటోంది. ఈ నేపథ్యంలో తన అల్లుడే ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టి ఉండవచ్చునని బాధితుడు పోలీసుల వద్ద అనుమానం వ్యక్తం చేశాడు. అతని ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు జరపనున్నట్లు ఎస్ఐ జి. రాజ్యలక్ష్మి తెలిపారు.

గ్లోబల్ టీచర్ ప్రైజ్ రేస్‌కు ఎంపికైన హరికృష్ణ



హరికృష్ణకు సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు

భట్టిప్రోలు: ప్రతిష్టాత్మక గ్లోబల్ టీచర్ ప్రైజ్ రేస్‌లో ఐలవరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆంగ్లోపాధ్యాయులు పచ్చారు హరికృష్ణ టాప్ 50లో స్థానం లభించడం పట్ల శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి ఘనంగా సన్మానించారు. ప్రపంచ వ్యాప్తంగా మారుమూల గ్రామాలు, పట్టణాల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని, విశ్వాసాన్ని పెంపొందిస్తూ మార్పు కోసం కృషి చేస్తున్న ఉపాధ్యాయులను గ్లోబల్ టీచర్ ప్రైజ్‌కు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ తరపున బాపట్ల జిల్లాకు చెందిన మన మండల ఉపాధ్యాయుడు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, సూపరింటెండెంట్ సీహెచ్ జలజ తదితరులు పాల్గొన్నారు.

నేడు చింతాయపాలెంలో వైద్య శిబిరం

కర్లపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శనివారం చింతాయపాలెంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశామని డీపీవో దాసరి రాంబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం డీపీవో రాంబాబు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని 15 సచివాలయాల పరిధిలో అక్టోబరు 18వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వెద్య శిబిరాలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఆరోగ్య సురక్ష శిబిరంలో మొత్తం నలుగురు డాక్టర్లు వైద్య సేవలందిస్తారని తెలిపారు.

నా భూమి - నా దేశం ర్యాలీ

భట్టిప్రోలు: నా భూమి–నా దేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ ఆదేశానుసారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన మేరీ మట్టి–మేరా దేశ్ కార్యక్రమాన్ని భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు నా భూమి– నాదేశం ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు పురవీధులలో జాతీయ నాయకులు, భారత మాత చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. పీఈటీలు ఎండీ అనూల్‌హక్, చేబ్రోలు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పల్లవి, బాలకోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



పుసులూరి నాగరాజు(ఫైల్)

రేపల్లె రూరల్: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసినట్లు పట్టణ సీఐ నజీర్‌బేగ్ తెలిపారు. మండలంలోని పేటేరు గ్రామానికి చెందిన పుసులూరి నాగరాజు (37)కు పల్లెకోన గ్రామానికి చెందిన మరియమ్మతో 20 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. వ్యవసాయ కూలీ పనులు చేసుకునే నాగరాజు కుటుంబ పోషణ పట్టించుకోకుండా అతిగా మద్యం సేవిస్తుండటంతో భార్య మరియమ్మతో విభేదాలు ఏర్పాడ్డాయి. దీంతో మరియమ్మ ఇటీవల తన కుమార్తెలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. భార్య కాపురానికి రావటంలేదని మనస్తాపంతో నాగరాజు ఈ నెల 26న ఇంటి నుంచి బయటకు వెళ్లి పేటేరు సమీపంలో ఊర కాల్వ వద్ద చెట్టుకు ఉరివేసుకున్నారు. శుక్రవారం అతనిని గమనించిన స్థానికులు సమాచారం అందించటంతో ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుడి తల్లి మార్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.